ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

పడకేసిన డబుల్ డెక్కర్!

రూ2.5 కోట్ల ప్రజాధనం వృథా



బస్సు పొడవు: 9 మీటర్లు
ఎత్తు: 4.5 మీటర్లు
వెడల్పు: 9 అడుగులు
సీట్ల సామర్థ్యం: 65
కొనుగోలు ధర: రూ2.14కోట్లు (6శాతం పన్ను అదనం)

చిన్నయ్యగారు మోజుపడి ప్రజల సొమ్ముతో కొన్న రెండంతస్తుల బస్సు షెడ్డుకు చేరింది. తిరుపతి నగరంలో ఎర్రెర్రని నిగనిగలతో డబుల్ డెక్కర్ తిరుగుతూ ఉంటే ఎక్కడానికి జనం ఎగబడతారని వేసిన అంచనా తలకిందులైంది. భూమన అభినయ్ డిప్యూటీ మేయర్‌గా ఉన్నపుడు దాదాపు రూ2.5కోట్ల ప్రజాధనం పోసి తిరుపతి కార్పొరేషన్ కొన్న ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సు చెత్తకుప్పల్లో దొరికే పాత బొమ్మలా మారిపోయింది. గత ఏడాది ఆగస్టు 8న రూ2.30కోట్ల కార్పొరేషన్ సాధారణ నిధులతో ఈ బస్సును కొనాలని కౌన్సిల్లో ప్రతిపాదించారు. ఆగమేఘాల మీద బస్సును కొనేశారు. మరి తిప్పేదెలా అని సందేహం వచ్చింది. ఆర్టీసీకి అప్పగించి అద్దె వసూలు చేయాలనుకున్నారు. వారు నిరాకరించడంతో కార్పొరేషనే బస్సును నడిపి టికెట్లు వసూలు చేయాలని నిర్ణయించుకుంది. ఇరుకురోడ్ల నగరంలో ఇంతెత్తు బస్సు తిప్పడం కష్టం కావడంతో రాత్రికిరాత్రే రెండువేలకు పైగా చెట్ల కొమ్మలను నరికి నేల కూల్చేశారు. గత ఏడాది అక్టోబరు 12న బస్సును రోడ్డుపైకి తీసుకొచ్చారు. ఎక్కడ ఎక్కి, దిగినా బస్సు చార్జీ రూ.50 అని నిర్ణయించారు. ఇబ్బడిముబ్బడిగా ఆదాయం వస్తుందనుకున్నారు కానీ, రోజుకు పదిమంది కూడా ఎక్కలేదు. దీంతో బస్సును కొంతకాలం ఉచితంగానే తిప్పారు.అయినా జనం ఎందుకో పెద్దగా ఎక్కలేదు. ఇంతా చేస్తే బస్సుకు రిజిస్ట్రేషనే లేదు. ఏదైనా తేడా వస్తే తమ నెత్తికి వస్తుందని భయపడి, రవాణ అధికారులు అభ్యంతరపెట్టడంతో బస్సును బయటకు తీయడం మానేశారు. ప్రస్తుతం కార్పొరేషన్ చెత్త వాహనాలు పార్క్ చేసే వినాయకసాగర్ పక్కన ఈ ఎర్ర బస్సు ఈసురోమంటూ నిలబడి ఉంది.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

4 సెట్విన్ బస్సులు వచ్చేవి

తిరుపతిలో సిటీ బస్సులే లేకుండా పోయాయి. గతంలో తిరుచానూరు, చంద్రగిరి, రేణిగుంటలకు నగరం లోపలి నుంచి సిటీ బస్సులు ఇబ్బడిముబ్బడిగా తిరిగేవి. నగరంలో ట్రాఫిక్ సమస్య పెరగడంతో వీటిని తగ్గించేశారు. జనం ఆటోల మీదే ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. రూ.కోట్ల ఖర్చుతో సోకుల బస్సులు కొనే బదులు చిన్న సైజు సెట్విన్ బస్సులు కొని నగరంలో తిప్పితే ఆటోలు, బైకుల సంఖ్య కూడా తగ్గేది. ట్రాఫిక్ అవస్థలు తప్పేవి. ప్రజలకూ రవాణా అందుబాటులో ఉండేది.

లోక్ అదాలత్ విజయవంతం



తిరుపతిలో కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి గురునాథ్

తిరుపతి(లీగల్), జూన్ 29: తిరుపతి జిల్లావ్యాప్తంగా కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ విజయవంతమైంది. మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, మూడవ అదనపు జిల్లా జడ్జి గురునాథ్ పర్యవేక్షణలో తిరుపతిలో లోక్ అదాలత్ ఏర్పాట్లు చేశారు. కేసుల పరిష్కారం కొరకు 8బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో బెంచ్‌కు ఒక న్యాయమూర్తితో పాటు న్యాయవాది, ముగ్గురు సిబ్బందిని కేటాయించారు. మొత్తం 287కేసులు పరిష్కారమయ్యాయి. న్యాయమూర్తుల సమక్షంలో ఇరు పార్టీల న్యాయవాదులతో చర్చించి కేసులను రాజీ చేశారు. శ్రీకాళహస్తి కోర్టులో 150 కేసులను, సత్యవేడులో 58, పుత్తూరులో 85, పాకాలలో 16, నాయుడుపేటలో 112,వెంకటగిరిలో 223, సూళ్లూరుపేటలో 149,కోటలో 423, కేసులను పరిష్కరించారు.

టీటీడీ ఈడీపీ ఆఫీస్‌లో ఏసీ గ్యాస్ లీకేజీతో కలకలం

తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని టీటీడీ ఈడీపీ ఆఫీస్‌లో ఏసీ నుంచి గ్యాస్ లీక్ కావడం కలకలం సృష్టించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్దనున్న ఈడీపీ ఆఫీస్‌లో శ్రీవారి దర్శన, ఆర్జితసేవల టికెట్లు, గదుల కేటాయింపు వంటి సమాచారాన్ని పొందుపరుస్తారు. శనివారం ఉదయం ఈడీపీ ఆఫీస్‌లోని ఓ ఏసీ కంప్రెసర్ నుంచి గ్యాస్ లీక్ కావడంతో ఫైర్ అలారం మోగింది. దీంతో విధుల్లోని సిబ్బంది ముందు జాగ్రత్తగా ఫైర్ స్టేషన్ అధికారులకు సమాచారమిచ్చారు. హుటాహుటిన ఫైర్ ఇంజన్‌తో సిబ్బంది ఘటనాప్రాంతానికి చేరుకుని ఏసీని పరిశీలించారు. ఏసీ నుంచి గ్యాస్ మాత్రమే లీకయ్యిందని, ఎలాంటి అగ్నిప్రమాదం జరగలేదని చెప్పడంతో ఈడీపీ కార్యాలయ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. గత ప్రభుత్వంలో దర్శన, ఆర్జితసేవా టికెట్ల కేటాయింపులో భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇటీవల స్టేట్ విజిలెన్స్ బృందం సోదాలు చేసి పలు రికార్డులను తీసుకున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో ఏసీ నుంచి గ్యాస్ లీక్ కావడం చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై విజిలెన్స్ అధికారులు విచారిస్తున్నట్టు సమాచారం.

వర్సిటీల్లో రాజకీయ ప్రభావాన్ని విద్యార్థులు తిప్పికొట్టాలి

ఏఐఎస్ఎఫ్ జాతీయ సమావేశాల్లో నేతల పిలుపు



సమావేశాల్లో ప్రసంగిస్తున్న ఈశ్వరయ్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 29: విద్యా కేంద్రాలన్నీ విద్యార్థి ఉద్యమ నిలయాలు కావాలని ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి రాష్ట్ర మాజీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ సమావేశాలు శనివారం తిరుపతిలోని ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాల్లో ప్రారంభమయ్యాయి.విద్యార్థి, రైతాంగ ఉద్యమాల్లో అమరులైన అతుల్ కుమార్ అంజన్, గగన్‌దీప్ సింగ్‌లకు తొలుత నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. యూనివర్సిటీల్లో అధికార పార్టీకి ఊడిగం చేసేవారికి గత వైసీపీ ప్రభుత్వం పదవులు కట్టబెట్టిందని మండిపడ్డారు. ఎస్వీయూలో గతంలో ఎంపీ మిథున్‌రెడ్డి కటౌట్ ఏర్పాటు చేయడం వంటి సంఘటనలను ఇందుకు ఉదాహరణగా చెప్పారు. వర్సిటీల్లో రాజకీయ ప్రభావాన్ని విద్యార్థులు తిప్పికొట్టాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. చట్టసభలు కోటీశ్వరులతో నిండి పోయాయన్నారు. అందువల్ల విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలని సూచించారు. నీట్ వ్యవహారంపై ప్రధాని మోదీ నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని అభిప్రాయపడ్డారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న కరుణాకరరెడ్డి నిలువెత్తు ఫ్లెక్సీని ఎస్వీయూ పరిపాలనా భవనానికి పెట్టడం తనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. వర్సిటీల్లో ఇలాంటి సంస్కృతిని ఏ పార్టీ అధికారంలో ఉన్నా విడనాడాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు రామకృష్ణ పాండా మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ అజెండాను పాఠ్యాంశాల్లో ప్రవేశపెడుతున్నారని, దీనిపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు.ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజ్, ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు సంఘమిత్ర, అమీన్ హంజా, మహేష్ కుంజం, జాతీయ కార్యదర్శులు కబీర్, షాహిద్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి, ఉపాధ్యక్షుడు బండి చలపతి, నాయకులు ఫణీంద్ర, ఉదయ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నవీన్, ప్రవీణ్, యూనివర్సిటీ నాయకులు చిన్న, చంద్ర, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు వెంకటరమణ, ప్రసాద్, జనార్దన్, మోహన్‌కుమార్‌రాజు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య, కాళయ్య, విశ్వనాథ్, పలు రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తగ్గిన కూరగాయల ధరలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 29: ఆకాశాన్నంటుతుండిన కూరగాయల ధరలు దిగి వచ్చాయి. మొన్నటి వరకు కిలో టమోటా రూ.100 పలికింది. అదేబాటలో ఉల్లి, వెల్లుల్లి, బెండకాయలు, ఆకుకూరలు ధరలు పోటీ పడ్డాయి. ప్రస్తుతం మదనపల్లె మార్కెట్‌కు డిమాండ్ కంటే అధికంగా టమోటాలు రావడం, దిగుబడి పెరగడంతో ధరలు తగ్గుముఖం పట్టాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం తిరుపతి మార్కెట్‌లో కిలో టమోటా రూ.50 పలుకుతోంది. ఉల్లి కిలో రూ.50 వరకు ఉంటోంది. బీన్స్, ముల్లంగి, బీట్‌రూట్, క్యారెట్, బీరకాయ, క్యాబేజీ, కాలీఫ్లవర్ ధరలు కూడా తగ్గాయి. కిలో రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. ఆకుకూర కట్టలు రెండు రూ.30, కొత్తిమీర కట్ట రూ.20, పుదీనా కట్ట రూ.20 లెక్కన విక్రయిస్తున్నారు. కిలో బెండకాయలు రూ.60, గోరుచిక్కుడు రూ.40, అనపకాయ రూ.50, బీట్‌రూట్ రూ.80, క్యారెట్ రూ.80, బీరకాయలు రూ.60 చొప్పున అమ్ముతున్నారు.

'ఎవరు గెలిచినా మీదే గెలుపు'

విజేతలకు బహుమతుల అందజేత



తిరుపతి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు అనే అంశంపై ఆంధ్రజ్యోతి నిర్వహించిన లక్కీడ్రా విజేతలకు శనివారం ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో నగదు బహుమతులను అందజేశారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లో ఏ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొందుతుందో పాఠకుల అంచనాలతో కూపన్లు ఆహ్వానించిన విషయం తెలిసిందే. అలావచ్చిన వేలాదికూపన్లనుంచి ఇటీవల లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపికచేశారు. తిరుపతిలోని చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన పి.శ్రీనివాసులు ప్రథమ బహుమతిని, అలాగే మూడు ద్వితీయ బహుమతులను తిరుచానూరు శంకర్ నాయుడు కాలనీకి చెందిన సీఆర్ ఖాదర్ బాషా, తిరుపతిలోని కుమ్మరతోపుకు చెందిన వి.మురళీకృష్ణ, చిత్తూరు గ్రీమ్స్‌పేటలోని గాయత్రీనగర్‌కు చెందిన ఈఎం ప్రసాద్‌లకు అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీలో గెలుపొందిన ఐరాలకు చెందిన పుల్లూరు మాధవన్ కూడా నగదు బహుమతి స్వీకరించారు.బ్రాంచ్ మేనేజర్ సురేష్ రెడ్డి, సర్క్యులేషన్ మేనేజర్ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై సుందరరాజస్వామి అభయం

● ముగిసిన అవతార మహోత్సవాలు


గరుడ వాహనంపై ఊరేగుతున్న సుందరరాజస్వామి

తిరుచానూరు, జూన్ 29: తిరుచానూరులో కొలువై ఉన్న సుందరరాజస్వామివారి అవతార మహోత్సవాలు శనివారం రాత్రి గరుడ వాహన సేవతో వేడుకగా ముగిశాయి. మధ్యాహ్నం కేటీ మండపంలో ఉత్సవర్లకు అభిషేకం, సాయంత్రం శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి తిరుమాడ వీధుల్లో సుందరరాజస్వామికి అత్యంత వేడుకగా గరుడవాహన సేవ జరిగింది. గత మూడు రోజులుగా జరుగుతున్న స్వామివారి అవతార మహోత్సవాలు శనివారం రాత్రితో ముగిశాయి. ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, ఏవీఎస్వో సతీష్, సూపరింటెండెంట్ మధు, శేషగిరి, కేపీ చంద్రశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుభాష్, గణేష్, అర్చకులు బాబుస్వామి, శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

నేడు ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే నాని పూజలు

భాకరాపేట, జూన్ 29: చిన్నగొట్టిగల్లులోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదివారం పూజలు నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ తెలిపారు. ఎన్నికల ప్రచార సమయంలో పూజలు నిర్వహించి, విజయం సాధించాలని కోరుకున్నారని, ఆయన కోరిక తీరడం వల్ల ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటారని చెప్పారు. అనంతరం చెరువుముందరపల్లెలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 16 కేసుల పరిష్కారం


పాకాల కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి కీర్తన

పాకాల, జూన్ 29: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ జూనియర్ సివిల్ జడ్జి కీర్తన అధ్యక్షతన శనివారం జాతీయ లోక్ అదాలత్ జరిగింది. క్రిమినల్, సివిల్ కేసులకు సంబంధించిన 16 కేసులను పరిష్కరించారు. రూ.9,39,000లకు సంబంధించి వివాదాలు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని కక్షిదారులు సత్వర న్యాయం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యుడు, న్యాయవాది ఎస్.ఎన్.ఎం.నదీం, స్థానిక న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, జూన్ 29: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10.30 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు కల్యాణోత్సవం, సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను అలంకరించి, బంగారు తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేసి, ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.5,16,957


హుండీ లెక్కిస్తున్న దృశ్యం

చంద్రగిరి, జూన్ 29: చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయ హుండీని శనివారం లెక్కించారు. జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖ తిరుపతి ప్రాంతీయ కార్యాలయ అధికారి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో ఈవో పుట్టా రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ సంవత్సరం మార్చి 27నుంచి ఈనెల 29వ తేదీ వరకు 94 రోజులు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.5,16,957 నగదు వచ్చింది. తిరుపతి రూరల్ మండలం, కొత్తచెర్లోపల్లిలోని అంజనేయస్వామి ఆలయ హుండీని లెక్కించగా, లెక్కించగా రూ.1,19,440 నగదు వచ్చింది. ఈ లెక్కింపులో చంద్రగిరి సప్తగిరి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, పోలీసు, రెవెన్యూ అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఇంటి వద్దనే విద్య


పరిశీలిస్తున్న ఐఈసీ చంద్రశేఖర్‌రెడ్డి

చంద్రగిరి, జూన్ 29: భవిత కేంద్రం ఉపాధ్యాయులు ప్రత్యేక అవసరాలున్న బడి ఈడు పిల్లలకు వారి ఇంటి వద్దే విద్యను ఎలా అందిస్తున్నారనే విధానాన్ని శనివారం జిల్లా ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. చంద్రగిరి పంచాయతీ పరిధిలో భవిత కేంద్రానికి రాలేని 10 మంది బడి ఈడు పిల్లలకు ప్రత్యేకంగా ఇంటి వద్దనే భవిత ఉపాధ్యాయులు విద్యను అందిస్తుండగా, ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేక అవసరాలున్న పిల్లలు, భవిత కేంద్రానికి రాలేని పిల్లలకు ఇంటి వద్దనే విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, ఎంఈవో భాస్కర్‌బాబు, ఐఈఆర్‌టీలు వెంకటరాజేశ్వరి, శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల పరిశీలన

చంద్రగిరి, జూన్ 29: మండలంలో దోర్నకంబాల, గంగుడుపల్లె పంచాయతీలలో రైతు భరోసా కేంద్రాలను మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సందర్శించారు. రైతు భరోసా కేంద్రాలలో గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాలను ధ్వంసం చేశారు. దీంతో శనివారం చెవిరెడ్డి ఆభవనాలను సందర్శించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఎలాంటి గొడవలకు వెళ్లవద్దని సూచించారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కృష్ణగిరి కాలనీకి తాగునీరు


బోరు మోటరును ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, జూన్ 29: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాలతో కొత్త కండ్రిగ పంచాయతీ అనిచెరువు, కృష్ణగిరి కాలనీ గ్రామస్థులకు టీడీపీ నాయకులు శనివారం తాగునీటి సౌకర్యం కల్పించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నాని కృష్ణగిరి కాలనీకి వచ్చిన సమయంలో గత ఐదేళ్లుగా గ్రామంలోని తాగునీటి మోటరు మరమ్మతులకు గురై ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అధికారంలోకి రాగానే సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో టీడీపీ జిల్లా కార్యదర్శి కోరా హరిప్రసాద్‌కు ఎమ్మెల్యే ఆ బాధ్యతను అప్పగించడంతో.. తాగునీటి బోరు మోటరు, పైపులైన్లను మరమ్మతులుచేసి శనివారం గ్రామస్థులకు తాగునీరు సరఫరా చేశారు. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు

తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి, శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 66,256 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,087 మంది తలనీలాలు సమర్పించారు.

రైతాంగానికి ఇబ్బంది లేకుండా
విద్యుత్ సరఫరా చేస్తాం

● ఎస్ఈ సురేంద్ర నాయుడు



తిరుపతి(ఆటోనగర్), జూన్ 29: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రైతాంగానికి ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని సూపరింటెండెంట్ ఇంజనీరు (ఎస్ఈ) పి.సురేంద్ర నాయుడు వెల్లడించారు. తిరుపతిలోని తన కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఏడు గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. రైతుల కోరిక మేరకు రెండు విడతలుగా సరఫరా చేస్తున్నాయని చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో ఏ గ్రూపులో రోజూ ఉదయం8.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, రాత్రి12 నుంచి2.30 గంటల వరకు సరఫరా చేస్తున్నామన్నారు. అదే బీ గ్రూపులో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు, రాత్రి రెండు గంటల నుంచి తెల్లవారు జామున నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా జరుగుతోందని వివరించారు. రైతుల కోరిక మేరకే రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు. జిల్లా మొత్తం ఏ గ్రూపులో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు, బీ గ్రూపులో ఉదయం 11 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. జిల్లాలో 1,133 వ్యవసాయ విద్యుత్ ఫీడర్లు ఉన్నాయన్నారు. పగలు 675, రాత్రి 485 ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతున్నట్లు తెలియజేశారు. 6,184 మంది రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. హెచ్‌టీ, ఎల్‌టీ పరిశ్రమలకు జూలై నెలాఖరులోపు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ తీగల సమస్యలు ఉంటే సమీప సబ్‌స్టేషన్లలోని ఫిర్యాదు పుస్తకాల్లో నమోదు చేయాలని కోరారు. వినియోగదారులు తమ సమస్యలను టోల్ ఫ్రీనెంబరు 1912 ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో టెక్నికల్ ఈఈ శ్రీనివసులు పాల్గొన్నారు.


టార్పాలిన్, డ్రమ్ములను అందజేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం

● ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుచానూరు, జూన్ 29: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి.. దాని ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకుందామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న ఎస్సీ పేద రైతులకు తిరుపతి రూరల్ మండలం తనపల్లి సమీపంలో రఘునాథ రిసార్ట్స్‌లో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం టార్పాలిన్‌లు, డ్రమ్ములను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు పలు పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఘన, ద్రవ బీజామృత, జీవామృతాలను, కషాయాలను తయారు చేయడానికి డ్రమ్ములను, పంటలను నాణ్యతగా నూర్పిడి చేసుకోవడానికి టార్పాలిన్‌లను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా పథక మేనేజరు షణ్ముగం, వ్యవసాయాధికారిణి మమత, అదనపు ప్రాజెక్టు మేనేజరు పట్టాభిరెడ్డి, సిబ్బంది స్వామి కొండయ్య, శ్రీదేవి, అయ్యప్ప నాయుడు, రంగయ్య, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

ఏనుగుల సంచారంతో అటవీశాఖ అప్రమత్తం

ఏడో మైలు వద్ద 30 మంది సిబ్బంది ఏర్పాటు

మంగళం, జూన్ 29: తిరుమల మొదటి ఘాట్‌లోని ఏడో మైలు వద్ద ఏనుగుల గుంపు సంచరిస్తున్న విషయం తెలిసిన వెంటనే అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. రోడ్డుకు సమీపంలోని అటవీప్రాంతానికి ఏనుగులు శుక్రవారం రావడంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. ఇవి రోడ్డుపైకి రాకుండా అటవీశాఖ సిబ్బందిని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. వీరు.. ఏనుగులు గుంపు అటువైపు రాకుండా వాటిని అడవిలోకి తరమడంతోపాటు భక్తులను అప్రమత్తం చేయనున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు 15మంది, రాత్రి నుంచి ఉదయం వరకు మరో 15మంది సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహిస్తారు. వీరితోపాటు మరికొంతమంది టీటీడీ సిబ్బంది కూడా ఉంటారు.

శేషాచల ప్రాంతంలోనే ఏనుగుల గుంపు

ఏడో మైలు వద్దకు వచ్చిన ఏనుగుల గుంపు శేషాచల కొండల్లోని అటవీ ప్రాంతంలోనే సంచరిస్తున్నాయి. కొంతకాలం క్రితం ఏనుగుల ఇక్కడకు వచ్చి వెళ్లాయి. అవ్వాచారి కోన సమీపంలో ఏరు ఉండటంతో సమీప ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. అంతేకాకుండా ఈ ప్రాంతం ఎత్తయిన కొండలతో కాకుండా చదునుగా ఉండటం.. ఆహారం, నీరు దొరుకుతుండటంతో తరచూ ఇవి ఈ ప్రాంతానికి వస్తున్నాయి. ఏనుగులు రోడ్డుపైకి వచ్చే అవకాశం లేదని భావిస్తున్నాం. ఏదేమైనా వీటిపై నిఘా ఉంచడానికి 15మంది చొప్పున 30మందితో రెండు బృందాలను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

- శ్రీనివాసరావు, సబ్ డీఎఫ్‌వో, తిరుపతి


సభలో ప్రసంగిస్తున్న వాసు యాదవ్

కోరం లేక టౌన్ బ్యాంక్ మహాజన సభ వాయిదా

తిరుపతి(ఆటోనగర్), జూన్ 29: తిరుపతి టౌన్ బ్యాంకు అభివృద్ధే ధ్యేయంగా తమ పాలక మండలి పనిచేస్తుందని వైస్ చైర్మన్ వాసు యాదవ్ తెలిపారు. శనివారం బ్యాంక్ ఆవరణలో మహాజన సభ ఆయన అధ్యక్షతన ప్రారంభమైంది. ఏక్లాస్ సభ్యుడు మునికృష్ణయ్య యాదవ్ మాట్లాడుతూ.. బ్యాంక్‌లో రుణాలు తీసుకున్న వారి వద్ద నుంచి సరళీకృత విధానంలో వసూలు చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. చివరకు కోరం సరిపడా వాటాదారులు హాజరు కాకపోవడంతో సభను వాయిదా వేశారు. బ్యాంకు డైరెక్టర్లు మబ్బు నాదమునిరెడ్డి, అమర్‌నాథరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఎం.చంద్రయ్య, కాసీం(చోటూబాయి), వెంకటేష్ రాయల్, అనిల్‌రాయల్, నాగిరెడ్డి, జ్యోతిప్రకాష్, సురేష్‌రెడ్డి, బ్యాంక్ ఎండీ శివకుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

హోటళ్లు, రెస్టారెంట్ల తనిఖీ


నూనెను తనిఖీ చేస్తున్న మద్దిలేటి

తిరుచానూరు, జూన్ 29: తిరుపతి నగరంలో శనివారం జిల్లా ఆహార భద్రతాధికారి ఎన్.మద్దిలేటి హోటళ్లు, రెస్టారెంట్లను తనిఖీ చేశారు. ఆయా ప్రాంతాల్లో ఆహారాన్ని తనిఖీ చేసి రెండు శాంపిల్స్‌ను తీసుకున్నారు. వీటిని ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ఆహార భద్రతా ప్రమాణాలు పాటించని వ్యాపారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సిబ్బంది టి.దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధపై సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 29: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సుపై ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం సదస్సు నిర్వహించారు. హైదరాబాదు ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్ సురేష్ మాట్లాడుతూ సమాజంలో కృత్రిమ మేధకు ప్రాముఖ్యత పెరుగుతోందన్నారు. హెడ్ డీవీ సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీకి కీలక నేత రాజీనామా


బాలచంద్రారెడ్డి

తడ, జూన్ 29 : వైసీపీ కీలకనేత, చెంగాళమ్మ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. దొరవారిసత్రం మండలానికి చెందిన ఆయన 2012లో వైసీపీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరి కీలక నేతగా ఎదిగారు. 2019లో అధికారం లోకి వచ్చిన వైసీపీ దువ్వూరు సేవలను గుర్తించి చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పదవి ఇవ్వడంతోపాటు పార్టీ రాష్ట్రస్థాయి పదవిని సైతం కట్టపెట్టింది. అయితే మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు, ఆయనకు మధ్య పొరపచ్చాలు ఏర్పడ్డాయి. కిలివేటి వ్యతిరేక వర్గంగా రాజకీయం చేయడం ప్రారంభించారు. ఒకానొక దశలో కిలివేటికి మరోసారి ఎమ్మెల్యే సీటు ఇస్తే పనిచేసేది లేదని అధిష్ఠానానికి తెగేసి చెప్పారు. ఈ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో ఆయన పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. అయితే శనివారం తన వ్యక్తిగత కారణాలతో వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి అధిష్ఠానానికి లేఖ పంపారు.

దేవళంపేటలో గజ దాడులు

ధ్వంసమైన టమోటా, మామిడి, కొబ్బరి, అరటి, చెరకు పంటలు


ధ్వంసమైన టమోటా పంట


విరిగిపోయిన మామిడి చెట్లు

కల్లూరు, జూన్ 29: పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీలో ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. వంకాయలపాటివారిపల్లి సమీపంలో శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు టమోటా, మామిడి, అరటి, చెరకు, కొబ్బరి పంటలపై దాడులు చేశాయి. వీకేపల్లిలో రెడ్డిశేఖర్ నాయుడుకు చెందిన ఎకరా టమోటా పంటను ధ్వంసం చేశాయి. కొబ్బరి, చెరుకు పంటలను విరిచేశాయి. అరటిచెట్లను తినేశాయి. చలపతినాయుడుకు చెందిన మామిడి, అరటి, పంటలను నాశనం చేసిన ఏనుగులు డ్రిప్ పైపులు, గేటువాల్వ్‌లను విరిచేశాయి. మామిడితోటకు ఏర్పాటు చేసిన ఇనుపగేటును ధ్వంసం చేశాయి. రెండు రోజుల క్రితం ఇదే రైతులకు చెందిన టమోటా, మామిడి పంటలను నష్టపరిచాయి. దీంతో బాధితులు లబోదిబో మంటున్నారు. నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

ఒంటరి ఏనుగు హల్‌చల్

బంగారుపాళ్యం : మండలంలోని గోవర్ధనగిరి సమీపంలో గల పంటలను శుక్రవారం రాత్రి ఒంటరి ఏనుగు నాశనం చేసింది. సుదర్శన్ నాయుడుకు చెందిన మామిడి తోటలో సుమారు 10 చెట్లను విరిచేసింది. రెండు టన్నుల మామిడి కాయలను నేలరాల్చింది.

ఆరణియార్‌లో చేపల వేటపై నిషేధం

పిచ్చాటూరు, జూన్ 29: ఆరణియార్ ప్రాజెక్టులో జూలై, ఆగస్టు నెలల్లో చేపల వేట నిషేధిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు తెలి పారు. మంచినీటి చేపలు జూలై, ఆగస్టు నెలల్లో సంతానోత్పత్తి చేస్తా యని, ఈ సమయంలో చేపల వేట వల్ల పిల్లల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందన్నారు. రెండు నెలల పాటు మత్స్యకార్మికులు ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లరాదని సూచించారు.

బాడీబిల్డర్ పోటీల్లో సీఆర్ఎస్ ఉద్యోగికి గోల్డ్‌మెడల్



రేణిగుంట, జూన్ 29: సీఆర్ఎస్‌లో ఉద్యోగి అభిలాష్ జాతీయస్థాయి బాడీబిల్డర్ పోటీల్లో బంగారు పతకం సాధించారు. ఈ నెల 23న ఢిల్లీలో వరల్డ్ ఫిట్నెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ప్రో క్వాలిఫై చాంపియన్‌షిప్ పోటీల్లో 60 కేజీల కేటగిరిలో అభిలాష్ జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించారు.శనివారం సీఆర్ఎస్‌లో జరిగిన కార్యక్రమంలో సీడబ్ల్యూఎం దైవ సహాయంతోపాటు అధికారులు, ఉద్యోగులు, అభిలాష్‌ను అభినందించారు.


కళా వెంకట్రావు




భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి - జితిన్ ప్రసాద్

అభివృద్ధి, సంక్షేమం కోసం
దేవుడు బాబును మళ్లీ సీఎం చేశాడు

ఎమ్మెల్యే కళా వెంకట్రావు

తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం దేవుడు చంద్రబాబును మళ్లీ సీఎం చేశాడని ఎమ్మెల్యే కళా వెంకట్రావు అన్నారు. తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ ప్రజలు కోరుకున్న ప్రభుత్వాన్నే భగవంతుడు ప్రసాదించారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో నెంబరు వన్‌గా మార్చేలా, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి చంద్రబాబు కృషి చేస్తారన్నారు. గతానికంటే ఎక్కువగా పనిచేసే శక్తిసామర్థ్యాలు చంద్రబాబుకు ప్రసాదించాలని శ్రీవారిని కోరుకున్నట్టు తెలిపారు. టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా కేంద్రమంత్రి జితిన్ ప్రసాద్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

తిరుమలలో మంత్రి పార్థసారథి


మంత్రికి స్వాగతం పలుకుతున్న జిల్లా అధికారులు

తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార పౌరసంబంధాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి శ్రీవారి దర్శనార్థం శనివారం రాత్రి తిరుమలకు వచ్చారు. తిరుమలలోని ఫీనెక్స్ అతిథిగృహం వద్దకు చేరుకున్న మంత్రికి జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు, కృష్ణయ్య, డివిజనల్ పౌర సంబంధాల అధికారిణి ఈశ్వరమ్మ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. మంత్రి ఆదివారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

'బచ్చల మల్లి' అల్లరి నరేష్ కెరీర్‌లో బెస్ట్ మూవీ


ఆలయం ముందు రాజేష్ దండా, సుబ్బు మంగదేవి

తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): హీరో అల్లరి నరేష్ కెరియర్‌లో 'బచ్చల మల్లి' బెస్ట్ కమర్షియల్ మూవీ కాబోతోందని ఈ చిత్ర నిర్మాత రాజేష్ దండా తెలిపారు. బచ్చల మల్లి చిత్ర దర్శకుడు సుబ్బు మంగదేవితో కలిసి శనివారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. శుక్రవారంతో 'బచ్చల మల్లి' చిత్రం షూటింగ్ పూర్తయిందన్నారు. హీరో పుట్టినరోజు సందర్భంగా ఈచిత్రానికి సంబంధించిన కొన్ని క్లిప్స్‌ను అభిమానుల ముందు ఉంచబోతున్నామన్నారు. అల్లరి నరేష్ ఇప్పటివరకు చేయని కొత్త కోణంలో నటించాడన్నారు. దర్శకుడు సుబ్బు మంగదేవి మాట్లాడుతూ.. స్వామి ఆశీస్సులతో 'బచ్చల మల్లి' అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నామన్నారు. అల్లరి నరేష్ జీవితంలో వన్ ఆఫ్ ది మైల్డ్‌స్టోన్ కాబోతోందన్నారు.

బాలాజీనగర్‌లో కొళాయిల ఏర్పాటుకు సర్వే


బాలాజీనగర్‌లో మొదటిలైన్‌లో టేపుతో కొలతలు తీసుకుంటున్న సిబ్బంది

తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని స్థానికులు నివసించే బాలాజీనగర్‌లో నీటి కుళాయిల ఏర్పాటుకు శనివారం సర్వే మొదలైంది. శ్రీవారి దర్శనార్థం శుక్రవారం తిరుమలకు వచ్చిన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బాలాజీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో స్థానికులతో సమావేశమై సమస్యలపై చర్చించిన విషయం తెలిసిందే. 90 రోజులలోపు బాలాజీనగర్‌లో నీటి సమస్యను పరిష్కరిస్తామని, 604 ఇళ్లకు నీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈక్రమంలో శనివారం బాలాజీనగర్‌లో జీరో, మొదటి, రెండవలైన్లలో టీటీడీ వాటర్ వర్క్స్ విభాగం సిబ్బంది సర్వే చేశారు. ఇళ్ల ముందు టేపుతో కొలతలు తీసుకున్నారు. మొత్తం ఎన్ని కిలోమీటర్లు నూతన పైపులైన్లు ఏర్పాటు చేయాల్సి వస్తుంది, ఎన్ని కొళాయిలు ఏర్పాటు చేయాలి, నీరు ఎంత అవసరముతుందనే అంశాలపై అధికారులు నివేదిక తయారుచేసే పనులు ప్రారంభించారు.



అమ్మవారి సేవలో సినీనటుడు సుమన్

తిరుచానూరు, జూన్ 29: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని శనివారం సినీనటుడు సుమన్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించి, అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పుట్టుకతో వచ్చే వ్యాధులపై అవగాహన అవసరం

తిరుపతి(వైద్యం), జూన్ 29: పుట్టుకతో వచ్చే వ్యాధులపై వైద్యులతోపాటు సిబ్బందికి కూడా అవగాహన అవసరమని డీఎంహెచ్‌వో శ్రీహరి అన్నారు. ఈ అంశంపై రుయాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. డీపీఎంవో శ్రీనివాస్, చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే


ఆరణిని సన్మానిస్తున్న ప్రతినిధులు

తిరుపతి అర్బన్, జూన్ 29: రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలియజేశారు. శనివారం ఓ హోటల్లో తిరుపతి తిరుపతి రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేని సన్మానించారు. ఈ సందర్భంగా ఆరణి మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో రేషన్ డీలర్లు పలు సమస్యలు ఎదుర్కొన్నారని చెప్పారు. డీలర్ల కమీషన్ పెంపు, లాగిన్ అవకాశం కల్పించే అంశాలను సీఎం, చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నాదెండ్ల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ప్రతినిధులు సోమశేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, గిరిబాబు, నాగరాజశెట్టి, సురేంద్ర, టీడీపీ నాయకులు ఆర్సీ మునికృష్ణ, నగేష్, మహేష్‌యాదవ్, జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, లోకేశ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'నవోదయ' ఫలితాల్లో 'విశ్వం' ప్రభంజనం


సాత్విక, మహిత, యుగంధర్, యశ్వంత్, లక్ష్మీనారాయణ

తిరుపతి(విద్య), జూన్ 29: జాతీయస్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 11వ తరగతిలో ప్రవేశాలకోసం నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో తిరుపతికి చెందిన విశ్వం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ స్కూల్ చైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు ఎం.యశ్వంత్, ఆర్.మహిత, ఎ.యుగంధర్, పి.సాత్విక, పి.లక్ష్మీనారాయణ.. సీట్లు సాధించారన్నారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో 6, 9 తరగతుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లోనూ గంగాజైదీప్‌రెడ్డి, లాస్య, లిఖిత, ఉదయశ్రీ, లక్ష్మి, కేతన్‌భాస్కర్, జ్యోత్స్న, గౌతమ్‌కుమార్, హేమంత్, కేథన్, హసినిలతోపాటు మొత్తం 48మంది విద్యార్థులు సీట్లు సాధించి సత్తా చాటారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లతో కలిసి అభినందించారు.

పదవీ విరమణ సత్కారం


పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ

తిరుపతి (నేరవిభాగం), జూన్ 29: పోలీసు అతిథి గృహంలో పదవీ విరమణ పొందిన ఎనిమిది మంది పోలీసు అధికారులను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శనివారం సత్కరించారు. సన్మానం అందుకున్న వారిలో.. పదవీ విరమణ పొందిన పరిపాలనాధికారి కిషోర్‌కుమార్, ఎస్ఐ కృష్ణమూర్తి, ఏఎస్ఐలు మహ్మద్ సాహెబ్, వి.మణి, సుబ్రహ్మణ్యం, రామరాజు, ఏఆర్ఎస్ఐ నరసింహులు నాయుడు, హెడ్‌కానిస్టేబుల్ రాజవేలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



తిరుపతి(విద్య), జూన్ 29: సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, చంద్రగిరి మండలం నడింపల్లె గ్రామ టీడీపీ యువ నాయకుడు దొండపాటి మునిశంకర్‌నాయుడు రూ.35వేల విలువైన విద్యాసామగ్రిని వితరణ చేశారు. స్థానిక సంజయ్‌గాంధీ కాలనీలోని నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం కె.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు అందజేశారు. తిరుపతి అర్బన్, రూరల్ ఎంఈవోలు బాలాజి, భాస్కర్‌నాయక్, దాత కుమారుడు నిహాల్, తెలుగు మహిళా నగర అధ్యక్షురాలు శాంతమ్మ, 9వ వార్డు మహిళా అధ్యక్షురాలు స్రవంతి, జనసేన నాయకులు రవి, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న చెంగల్‌రెడ్డి

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 29: ప్రజా రవాణాధికారి కార్యాలయంలో పీఆర్వోగా పనిచేస్తుండిన బి.కృష్ణారెడ్డి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయన్ను శనివారం సన్మానించారు. డీపీటీవో తిమ్మాడి చెంగల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవగా, డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, సీఎంఈ నరసింహులు, తిరుపతి డీఎం బాలాజీ, ఏటీఎం డి.రామచంద్రనాయుడు, ఈవో జిల్లా కార్యదర్శి తాండాయం సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, ఫైనాన్స్ అసిస్టెంట్ మేనేజర్ రమేష్, సూపరింటెండెంట్ పి.సి.బాబు, టీటీఐ బి.మణి కూడా ఉద్యోగ విరమణ చేయడంతో వారిని కూడా సత్కరించారు.

5న 'ఆర్టీసీ కార్గో'లో వేలం

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 29: సీబీఎస్‌లోని ఆర్టీసీ కార్గోలో కొంతకాలంగా నిల్వ ఉన్న వస్తువులను వచ్చే నెల 5న బహిరంగ వేలం వేయనున్నట్లు కమర్షియల్ ఏటీఎం డి.రామచంద్రనాయుడు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజున ఉదయం 10.30గంటలకు వేలం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్చరీ పోటీల్లో ప్రియా ప్రణవి ప్రతిభ



మంగళం, జూన్ 29: చెన్నాయగుంట గ్రామ సమీపంలో ఉన్న స్ప్రింగ్ డేల్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ప్రియా ప్రణవి జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు పాఠశాల నిర్వాహకుడు కేఎస్ వాసు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం విద్యార్థినిని ప్రిన్సిపాల్ కేఆర్ అనురాధా గోపాల్, ప్రధానోపాధ్యాయురాలు ప్రమీలకృష్ణన్, ఏవోకే చంద్రశేఖరన్, పీఆర్వో సాంబశివారెడ్డి, టీచర్లు అభినందించారు.

ఎమ్మెల్యేని కలసిన న్యాయవాదులు

తిరుపతి(లీగల్), జూన్ 29: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను నగరానికి చెందిన టీడీపీ, జనసేన లీగల్‌సెల్ న్యాయవాదులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి కోర్టు భవనాలకు సంబంధించి చర్చించారు. సీనియర్ న్యాయవాది కంచిప్రకాశం, దినకర్, గాలిశ్రీనివాసులు, కంచి ప్రవీణ్, అప్పిలి ఉమాపతి, నారాయణ, గాజులకృష్ణయ్య, వేణుగోపాల్, భార్గవ్‌రాయల్, తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ ఫలితాల్లో 'రిమ్స్' విజయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న ప్రకాశ్‌రెడ్డి

తిరుపతిరూరల్, జూన్ 29: ఎస్వీయూ విడుదల చేసిన ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో బైరాగిపట్టెడలోని రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్(రిమ్స్) కళాశాల విద్యార్థులు అత్యుత్తమ జీపీఏ మార్కులతో విజయకేతనం ఎగురవేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఎస్.చాందిని, వి.వైష్ణవి 8.11జీపీఏ, వి.బిందు 8.01జీపీఏ మార్కులు పొంది టాపర్లుగా నిలవడంతోపాటు పరీక్షకు హాజరైన 80మంది విద్యార్థులు పాసై వంద శాతం ఉత్తీర్ణత నమోదు చేశారని వివరించారు. 77మంది విద్యార్థులు డిస్టింక్షన్లు సాధించగా.. ముగ్గురు ప్రథమశ్రేణిలో పాసయ్యారని తెలిపారు. కాగా.. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం టాపర్లకు ప్రిన్సిపాల్ నగదు బహుమతిని అందజేశారు. విద్యార్థులను చైర్మన్ వై.కొండారెడ్డి, డైరెక్టర్లు వై.ఆనందరెడ్డి, వై.విజయ్‌రెడ్డి, ఎంబీఏ హెడ్ డాక్టర్ పి.నిరంజన్‌రెడ్డి, ఎంసీఏ అండ్ కంప్యూటర్ సైన్స్ హెడ్ పి.మధుర, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఎర్రజెండా నీడన నా అనుభవాలు పుస్తకావిష్కరణ నేడు

తిరుపతి (కల్చరల్), జూన్ 29: ప్రముఖ వామపక్ష నాయకుడు ఏవీ వర్మ రచించిన ఎర్రజెండా నీడన నా అనుభవాలు పుస్తకావిష్కరణ సభ ఆదివారం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం హాలులో జరగనుంది. ఉదయం 10 గంటలకు జరిగే సభలో ముఖ్యఅతిథులుగా వామపక్షనేతలు, రాజ్యసభ మాజీ సభ్యుడు మధు, సీఐటీయూ రాష్ట్రప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు సుమన్‌కు ఇస్కాన్ ఆహ్వానం

తిరుపతి (కల్చరల్), జూన్ 29: ఇస్కాన్ శ్రీకృష్ణ ఆలయంలో ఆగస్టు 25, 26, 27 తేదీల్లో జరిగే జన్మాష్టమి వేడుకలకు రావాలని సినీ నటుడు సుమన్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు ఆలయ ప్రజా సంబంధాల అధికారి లీలాపారాయణ దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇస్కాన్ వ్యవస్థాపకుడు స్వామి శ్రీలప్రభుపాదులు ఆవిర్భావ దినోత్సవం కూడా ఆగస్టు 27వ తేదీన జరుగుతుందని వివరించామన్నారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తిరుపతి (ఆటోనగర్), జూన్ 29 : ఉమ్మడి చిత్తూరు జిల్లా(తిరుపతి సర్కిల్)లోని అన్ని డివిజన్లలో విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలు ఆదివారం కూడా పనిచేస్తాయని ఎస్ఈ సురేంద్రనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలవరకు సిబ్బంది ఉంటారని.. వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చన్నారు.

పరిశోధనల్లో డేటా సైన్స్ కీలకం

వెటర్నరీలో జాతీయ గణాంక దినోత్సవం


జ్యోతిని వెలిగిస్తున్న వెంగమ్మ, వీరబ్రహ్మయ్య తదితరులు

తిరుపతిరూరల్, జూన్ 29: పరిశోధనల్లో డేటా సైన్స్ అత్యంత కీలకమని పలువురు వక్తలు అన్నారు. తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో శనివారం జాతీయ గణాంక దినోత్సవాన్ని నిర్వహించారు. సాంఖ్యకశాస్త్ర పితామహుడు పీసీ మహలనోబిస్ చిత్రపటానికి ప్రొఫెసర్లతో కలిసి అతిథులు పూలమాలవేసి నివాళి అర్పించారు. దీనిలో భాగంగా వర్సిటీ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్‌సైన్స్, ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్(ఐఎస్‌పీఎస్, తిరుపతి) సంయుక్త ఆధ్వర్యంలో బయోస్టాటిస్టిక్స్‌లో ట్రెండ్స్ అండ్ చాలెంజస్ అనే అంశంపై వెటర్నరీ డీన్ కె.వీరబ్రహ్మయ్య అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ ఎస్‌డీయూఆర్‌టీ వీసీ డాక్టర్ బి.వెంగమ్మ మాట్లాడుతూ.. మెడికల్ స్టాటిస్టికల్ ఎథిక్స్ అండ్ చాలెంజ్ ఎని వివరించారు. స్విమ్స్ డీన్ అల్లాడి మోహన్ మాట్లాడుతూ.. మెడికల్ స్టాటిస్టిక్స్, క్లినికల్ ఇంటెలిజన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్‌లను విశదీకరించారు. అలాగే చెన్నైకి చెందిన ఐసీఎంఆర్ ప్రతినిధి డాక్టర్ రాజేంద్రన్, ప్రెసిడెన్సీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ విశ్వనాథన్, పాండిచ్చేరి వర్సిటీకి చెందిన డాక్టర్ విష్ణువర్ధన్, వ్యవసాయవర్సిటీకి చెందిన డాక్టర్ షేక్ నఫీజ్ ఉమర్, తదితరులు ప్రసంగించారు. ఐఎస్‌పీఎస్ గౌరవ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఎమిరైటస్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు బి.రాంబాబునాయక్, కుట్టికుమార్, జెడ్.నవీన్, టి.చైతన్యకుమార్, ఎం.స్రవంతి, సుధీర్, హేమంత్, సుకీర్తి, వివిధ విద్యాసంస్థలకు చెందిన 80మంది విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

పదవీ విరమణ గొప్ప అనుభూతి


రత్నరాజు దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

తిరుపతి(వైద్యం), జూన్ 29: పదవీ విరమణ పొందడం అనేది ఉద్యోగి జీవితంలో గొప్ప అనుభూతి అని రుయా సూపరింటెండెంట్ రవిప్రభు అన్నారు. రుయాస్పత్రిలో పదవీ విరమణ చేసిన అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రత్నరాజుకు శనివారం సిబ్బంది ఘనంగా వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. సూపరింటెండెంట్‌తోపాటు డీఎంహెచ్‌వో శ్రీహరి ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. అనంతరం రత్నరాజు దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎంవో హరికృష్ణ, ఏవో రమేష్, ఉద్యోగులు గిరిప్రసాద్, నైనారు వరప్రసాద్, రాజా, అరుణమ్మ, చిట్టిబాబు, హరిప్రసాద్, ఫణిభూషణ్, చైతన్య, తులసీరెడ్డి, మోహన్‌రెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఈవోను కలిసిన ఎమ్మెల్యే, ఎన్వీ



తిరుపతి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్యామలరావును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తుడా మాజీ చైర్మన్ ఎన్వీ ప్రసాద్‌లు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీటీడీ పరిపాలన భవనంలో ఉన్న ఈవోను కలిసి శాలువాతో సత్కరించారు.

రుద్రకోటికి సత్కారం



తిరుపతి (కల్చరల్), జూన్ 29: తిరుపతిలో వాయిద్య కళాకారుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రముఖ వాద్య కళాకారుడు రుద్రకోటి సదాశివం అభినందనీయుడని పలువురు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు సదాశివంను ఆయన నివాసంలో పలువురు కళాకారులు కలిసి అభినందించి, సత్కరించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత వినుకొండ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో పలువురు కళాకారులు పాల్గొన్నారు.

ఆటోలపై ఆంక్షలు తగవు

తిరుపతి (జీవకోన), జూన్ 29: కరకంబాడి వైపు నుంచి నగరంలోకి ప్రయాణికులతో వచ్చే ఆటోల రాకపోకలపై ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించడం తగదని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ ఆంక్షలకు నిరసనగా నగర పరిధిలోని రెడ్డిగుంట సమీపంలో కరకంబాడి-తిరుపతి మార్గంలో శనివారం ఆటోడ్రైవర్లు నిరసన తెలిపారు. కరకంబాడి, మంగళం నుంచి నగరంలోకి ప్రయాణికులను తీసుకొస్తున్న ఆటోలను పోలీసులు అడ్డుకున్నారు. వేరే మార్గంలో వెళ్లాలని ఆదేశించారు. ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉంటుందని డ్రైవర్లు చెప్పినా పోలీసులు ససేమిరా అన్నారు. దాంతో ఆటోడ్రైవర్లు రోడ్డుపై బైఠాయించారు. అటుగా వెళుతున్న టీడీపీ నాయకులు కృష్ణయాదవ్, కాయం వెంకటరత్నం పోలీసులతో మాట్లాడి ఆటోలను నగరంలోకి వెళ్లనివ్వాలని కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అప్పటి వరకు ఎలాంటి ఆంక్షలు అమలు చేయవద్దని సూచించడంతో పోలీసులు సడలించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

సినీ రంగం కష్టాలు తెలిసిన వ్యక్తి పవన్‌కల్యాణ్ - నటుడు సుమన్


గోవిందరాజస్వామి ఆలయంలో సుమన్

తిరుపతి అర్బన్, జూన్ 29: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సినీ నటుడు సుమన్ స్పష్టం చేశారు. శనివారం ఉదయం గోవిందరాజస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగులకు సొంతూళ్లలోనే ఉద్యోగ అవకాశాలు లభించేలా సీఎం కృషి చేయాలని కోరారు. సినీ పరిశ్రమలో చాలామంది ఇబ్బందుల్లో ఉన్నారని, వారిని కూడా ఆదుకోవాలన్నారు. స్టూడియోలు నిర్మిస్తే వెండి తెరతోపాటు బుల్లితెర పరిశ్రమ మరింత మెరుగుపడుతుందన్నారు. తిరుపతిని టెంపుల్‌సిటీగా ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు. సినీ రంగం ఎదుర్కొనే కష్టాలు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు తెలుసునన్నారు. ప్రస్తుత పరిస్థితుల నుంచి త్వరలోనే సినీ రంగం తేరుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. వైసీపీకి చెందిన సినీ నటుల రాజీనామాపై స్పందిస్తూ.. అది వారి వ్యక్తిగతమన్నారు. రాజకీయాల్లో అందరినీ సంతృప్తిపరచడం చాలా కష్టమన్నారు. ఎవరికి తలరాత ఉంటే వారికి మాత్రమే పదవులు లభిస్తాయన్నారు.

టీటీడీ విద్యాసంస్థల్లో సీట్లు పెంచండి

ఈవోకు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి వినతి


ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న రాంగోపాల్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 29: టీటీడీ విద్యాసంస్థల్లో సీట్లు పెంచాలని ఈవో శ్యామలరావును ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి కోరారు. శనివారం ఈవోను కలిసి వినతిపత్రం అందజేశారు. రాయలసీమ ప్రాంతంలోని నిరుపేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సీట్లు పెంచాలన్నారు. ఐదేళ్లుగా టీటీడీ విద్యాసంస్థల్లో పర్యవేక్షణ కొరవడిందని చెప్పారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు రాగల ఆనంద్ గౌడ్, అనిమిని రవి నాయుడు, డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్ సెక్యూరిటీ నిజాయితీ

● పోగొట్టుకున్న పర్సు బాధితులకు అందజేత


పర్సును బాధితుడికి అప్పగిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

తిరుపతి(వైద్యం), జూన్ 29: పోగొట్టుకున్న పర్సును బాధితులకు అందజేసి.. స్విమ్స్ సెక్యూరిటీ తమ నిజాయితీ చాటుకున్నారు. దొరవారి సత్రం మండలం పాళెంపాడుకు చెందిన కోటేశ్వరరావు ఈనెల 27న వైద్యం కోసం స్విమ్స్‌కు వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో తన పర్సును జారవిడుచుకున్నాడు. ఆ సమయంలో విధుల్లో ఉన్న సెక్యూరిటీ శివకృష్ణకు ఆ పర్సు దొరకడంతో దానిని సెక్యూరిటీ అధికారులకు అందజేశాడు. వారు పర్సును పరిశీలించగా, అందులో రూ.10వేలతోపాటు ఏటీఎం కార్డులు, ఇతర రశీదులు ఉండటాన్ని గుర్తించారు. రశీదుల ఆధారంగా బాధితుడికి సమాచారం ఇవ్వడంతో ఆయన సోదరుడు రమణయ్య శనివారం స్విమ్స్‌కు చేరుకున్నాడు. దాంతో పర్సును ఆయనకు సెక్యూరిటీ అధికారులు అందజేశారు. దాంతో సిబ్బందిని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అభినందించారు.

అలరించిన నాటకం, ఏకపాత్రాభినయాలు


చంద్రమతి ఏకపాత్రాభినయం - అరణ్య పర్వంలో..- పార్వతి కల్యాణంలో ఓ సన్నివేశం

తిరుపతి (కల్చరల్), జూన్ 29: తిరుపతికి చెందిన సుబ్బరాజు నాట్య కళాపరిషత్.. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం మహతి కళాక్షేత్రంలో పలు సాంస్కృతిక పోటీలు నిర్వహించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి విచ్చేసిన పలువురు కళాకారుల ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది. రాత్రి ఎనిమిది గంటలకు పార్వతీ కల్యాణం పద్యనాటకం ప్రేక్షకులను అలరించింది. అంతకుముందు జరిగిన సభలో పరిషత్ తరఫున డీఎస్పీ రావు, శర్మ, రవీందర్, రాధాకృష్ణ, ఆమూరి సుబ్రహ్మణ్యం వంటి పలువురు రంగస్థల కళాకారులను నిర్వాహకులు సత్కరించారు. ఈ సభలో పరిషత్ వ్యవస్థాపకుడు కోనేటి సుబ్బరాజు, బీజేపీ నేతలు నవీన్ కుమార్ రెడ్డి, గుండాల గోపీనాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఆదివారం కూడా ఉదయం 10 గంటల నుంచి సాంస్కృతిక పోటీలు జరుగుతాయి. రాత్రి ఏడు గంటలకు బూడిద.. సాంఘిక నాటిక ప్రదర్శిస్తారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రిటైర్డ్ ఏఎస్ఐ కిలివేటికి సత్కారం



పెళ్లకూరు, జూన్ 29 : పెళ్లకూరు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన కిలివేటి సుబ్రహ్మణ్యంను శనివారం జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. సూళ్లూరుపేట సమీపంలోని కోటపోలూరుకు చెందిన కిలివేటి సుబ్రహ్మణ్యం 1989లో కానిస్టేబుల్‌గా ఎంపికై 2012లో హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. 2018లో ఏఎస్ఐగా పెళ్లకూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు చేపట్టి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన సుబ్రహ్మణ్యం శనివారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఏఎస్పీలు వెంకటరావు, విమలకుమారి చేతులమీదుగా సత్కారం అందుకున్నారు.

ఆల్ ది బెస్ట్ ఆకృతిలో మానవహారం



గూడూరు అర్బన్, జూన్ 29: టీ-20 ప్రపంచ కప్‌లో భారత్ క్రికెట్ టీం విజేతగా నిలవాలని ఆది శంకర పాఠశాల విద్యార్థులు ఆల్ ది బెస్ట్ ఆకృతిలో మానవహారం ఏర్పాటు చేసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం స్థానిక గోగినేనిపురంలోని ఆదిశంకర పాఠశాలలో విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేసి భారత్ టీంకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రూపవతి మాట్లాడుతూ శనివారం జరిగే టీ-20 ప్రపంచ కప్‌లో సౌత్ ఆఫ్రికాపై భారత్ టీం గెలిచి దేశప్రతిష్ఠను నిలపాలని ఆకాంక్షిస్తూ భారతీయుల కలలను నేరవేర్చాలని కోరుకుంటూ తమ పాఠశాల విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున, ప్రశాంత్, మనోహర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'నవోదయ' ఫలితాల్లో 'విశ్వం' ప్రభంజనం



సాత్విక, మహిత, యుగంధర్, యశ్వంత్, లక్ష్మీనారాయణ

తిరుపతి(విద్య), జూన్ 29: జాతీయస్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 11వ తరగతిలో ప్రవేశాలకోసం నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో తిరుపతికి చెందిన విశ్వం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ స్కూల్ చైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు ఎం.యశ్వంత్, ఆర్.మహిత, ఎ.యుగంధర్, పి.సాత్విక, పి.లక్ష్మీనారాయణ.. సీట్లు సాధించారన్నారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో 6, 9 తరగతుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లోనూ గంగాజైదీప్‌రెడ్డి, లాస్య, లిఖిత, ఉదయశ్రీ, లక్ష్మి, కేతన్‌భాస్కర్, జ్యోత్స్న, గౌతమ్‌కుమార్, హేమంత్, కేథన్, హాసినిలతోపాటు మొత్తం 48మంది విద్యార్థులు సీట్లు సాధించి సత్తా చాటారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లతో కలిసి అభినందించారు.

జనసేన కార్యాలయంలో నటుడు ప్రభాకర్



వెంకటగిరిటౌన్, జూన్ 29: పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం బాహుబలి సినిమాలో కాలకేయగా నటించిన ప్రభాకర్ సందడి చేశారు. ప్రభాకర్‌ను చూసేందుకు జనసేన నాయకులు, అభిమానులు వచ్చి ఫొటోలు తీసుకున్నారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ వెంకటగిరిలో జరుగుతున్న సలాం సైనిక షూటింగ్‌కు వచ్చామన్నారు. అనంతరం జనసేన ఉమ్మడి నెల్లూరుజిల్లా ప్రధానకార్యదర్శి గూడూరు వెంకటేశ్వర్లుతో జనసేన కార్యకలాపాలు అడిగి తెలుసుకున్నారు.

మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే పాశం



టీ తాగుతున్న ఎమ్మెల్యే సునీల్ కుమార్

కోట, జూన్ 29: గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ తానిచ్చిన మాటను శనివారం రాత్రి నెరవేర్చారు. గతేడాది కోటలో యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేష్, అప్పటి మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌లకు కోట బజారు సెంటర్‌లో ఉన్న ఓ టీ కొట్టు యజమాని పరుగుపరుగున వచ్చి నీళ్లు ఇచ్చి తాగమని చెప్పారు. తన కొట్టులో టీ తెచ్చి ఇచ్చి సేదతీరి పాదయాత్ర వేగం పెంచాలని పాశం సునీల్‌కుమార్ భుజం తట్టారు. ఎమ్మెల్యే అయిన తర్వాత ఇక్కడకే వచ్చి నీ దగ్గర టీ తాగుతానని మాటిచ్చారు. ఎట్టకేలకు ఎన్నికల్లో పాశం సునీల్‌కుమార్ గెలిచి తొలిసారిగా కోటకు వచ్చి అదే కొట్టులో టీ తాగి మాట నిలబెట్టుకున్నారు.

రైతాంగానికి ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా
ఎస్ఈ సురేంద్ర నాయుడు

తిరుపతి(ఆటోనగర్), జూన్ 29: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రైతాంగానికి ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని సూపరింటెండెంట్ ఇంజనీరు (ఎస్ఈ) పి.సురేంద్ర నాయుడు వెల్లడించారు. తిరుపతిలోని తన కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఏడు గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. రైతుల కోరిక మేరకు రెండు విడతలుగా సరఫరా చేస్తున్నాయని చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో ఏ గ్రూపులో రోజూ ఉదయం8.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, రాత్రి12 నుంచి2.30 గంటల వరకు సరఫరా చేస్తున్నామన్నారు. అదే బీ గ్రూపులో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు, రాత్రి రెండు గంటల నుంచి తెల్లవారు జామున నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా జరుగుతోందని వివరించారు. రైతుల కోరిక మేరకే రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు. జిల్లా మొత్తం ఏ గ్రూపులో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు, బీ గ్రూపులో ఉదయం 11 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. జిల్లాలో 1,133 వ్యవసాయ విద్యుత్ ఫీడర్లు ఉన్నాయన్నారు. పగలు 675, రాత్రి 485 ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతున్నట్లు తెలియజేశారు. 6,184 మంది రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. హెచ్‌టీ, ఎల్‌టీ పరిశ్రమలకు జూలై నెలాఖరులోపు కనెక్షన్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ తీగల సమస్యలు ఉంటే సమీప సబ్‌స్టేషన్లలోని ఫిర్యాదు పుస్తకాల్లో నమోదు చేయాలని కోరారు. వినియోగదారులు తమ సమస్యలను టోల్ ఫ్రీనెంబరు 1912 ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో టెక్నికల్ ఈఈ శ్రీనివసులు పాల్గొన్నారు.

ఏనుగుల సంచారంతో అటవీశాఖ అప్రమత్తం
ఏడో మైలు వద్ద 30 మంది సిబ్బంది ఏర్పాటు

మంగళం, జూన్ 29: తిరుమల మొదటి ఘాట్‌లోని ఏడో మైలు వద్ద ఏనుగుల గుంపు సంచరిస్తున్న విషయం తెలిసిన వెంటనే అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. రోడ్డుకు సమీపంలోని అటవీప్రాంతానికి ఏనుగులు శుక్రవారం రావడంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. ఇవి రోడ్డుపైకి రాకుండా అటవీశాఖ సిబ్బందిని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. వీరు.. ఏనుగులు గుంపు అటువైపు రాకుండా వాటిని అడవిలోకి తరమడంతోపాటు భక్తులను అప్రమత్తం చేయనున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు 15మంది, రాత్రినుంచి ఉదయం వరకు మరో 15మంది సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహిస్తారు. మరికొంతమంది టీటీడీ సిబ్బంది ఉంటారు.

శేషాచల ప్రాంతంలోనే ఏనుగుల గుంపు

ఏడో మైలు వద్దకు వచ్చిన ఏనుగుల గుంపు శేషాచల కొండల్లోని అటవీ ప్రాంతంలోనే సంచరిస్తున్నాయి. కొంతకాలం క్రితం ఏనుగుల ఇక్కడకు వచ్చి వెళ్లాయి. అవ్వాచారి కోన సమీపంలో ఏరు ఉండటంతో సమీప ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. అంతేకాకుండా ఈ ప్రాంతం ఎత్తయిన కొండలతో కాకుండా చదునుగా ఉండటం.. ఆహారం, నీరు దొరుకుతుండటంతో తరచూ ఇవి ఈ ప్రాంతానికి వస్తున్నాయి. ఏనుగులు రోడ్డుపైకి వచ్చే అవకాశం లేదని భావిస్తున్నాం. ఏదేమైనా వీటిపై నిఘా ఉంచడానికి 15మంది చొప్పున 30మందితో రెండు బృందాలను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

- శ్రీనివాసరావు, సబ్ డీఎఫ్‌వో, తిరుపతి

నిరాశ్రయుల కేంద్రంలో అన్నదానం

గూడూరు అర్బన్, జూన్ 29: స్థానిక గమళ్లపాలెంలోని నిరాశ్రయుల కేంద్రంలో శనివారం నరసయ్య దాతృత్వంతో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, ప్రదీప్‌కుమార్, సునీల్‌కుమార్, రాహుల్, కలీమ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా రేషన్ సరుకుల పంపిణీ

నాయుడుపేట టౌన్, జూన్ 29 : జూలై 1వ తేదీ నుంచి వేగవంతగా రేషన్ సరుకులను పంపిణీ చేయాలని తహసీల్దారు కళ్యాణి సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో శనివారం రేషన్ దుకాణందారులు, ఎండీ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రేషన్ సరుకుల పంపిణీ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీలు రాజేంద్ర, ఓబయ్య, రేషన్ దుకాణందారులు, ఎండీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, జూన్ 29: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్లకు పూజలు జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిపారు. రాత్రికి స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ జరిపి ఆలయం ఆవరణలో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

చిల్లకూరు, జూన్ 29: పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలకు శనివారం చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులునాయుడు మైక్‌సెట్‌ను వితరణగా అందజేశారు. డీఈవో శేఖర్ మాట్లాడుతూ శ్రీనివాసులునాయుడు విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులునాయుడు, ఎంఈవోలు సనత్‌కుమార్, రవూఫ్, ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్ర, ఉపాధ్యాయులు శివరామిరెడ్డి, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, వీవీ కుమార్, సరేంద్ర, చంద్రశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

చిల్లకూరు, జూన్ 29: డయేరియా బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సుమ అన్నారు. శనివారం స్థానిక దళితవాడలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో మునిలక్ష్మి, రవికుమార్, లక్ష్మి, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశానికి
దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి,జూన్29: వెంకటగిరి ఐటీఐలో రెండో విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన బాలబాలికలు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. నమోదు చేయించుకున్న అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నెంబరుతోపాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో వచ్చి స్థానిక ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. వివరాలకు 9866420415, 9441850595 నంబర్లలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



వెంకటగిరిటౌన్, జూన్ 29: స్థానిక బంగారుపేట ప్రాథమికోన్నత పాఠశాల వద్ద శ్రీనివాస సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి అరవింద కంటి ఆసుపత్రి వారు ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇన్‌చార్జి జయసింగ్ మాట్లాడుతూ ఈ శిబిరంలో 286 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి 60 మందికి శస్త్ర చికిత్సలు చేయించాలని డాక్టర్లు నిర్ధారించారు. కార్యక్రమంలో తిరుపతి అరవింద కంటి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ట్రస్టు నిర్వాహకులు వీడీవో కేశవులు, సతీష్, అలేఖ్య, పార్థ, సాయి, శివ పాల్గొన్నారు.

చేపల వేలం పాట

బాలాయపల్లి, జూన్29: మండలంలోని ఊట్లపల్లి పంచాయతీ పరిధి పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓటు చెరువులోని చేపలు పట్టుకునేందుకు శనివారం పంచాయతీ విస్తరణాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలంపాటలో దుర్గాటి పవన్‌కళ్యాణ్ అనే వ్యక్తి రూ.17 వేలకు పాట దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోళ్ల సుధాకర్ బాబు, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య బోధించాలి : డీఈవో



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న డీఈవో శేఖర్

గూడూరు, జూన్ 29: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని డీఈవో శేఖర్ అన్నారు. శనివారం స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు స్టూడెంట్ కిట్లు అందజేసి పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వారు చదువులలో రాణించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో శాంతి, ఎంఈవో సనత్‌కుమార్, మస్తానయ్య, మాధవిలక్ష్మి, రవూఫ్ పాల్గొన్నారు.

చిల్లకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో శేఖర్ సూచించారు. శనివారం మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేసి ఉపాధ్యాయులతో విద్యార్థుల బోధన, నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి వెనుకబడిన వారికి ప్రత్యేక బోధన అందించాలన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించి భోజనం చేశారు. ఎంఈవోలు సనత్‌కుమార్, రవూఫ్, హెచ్‌ఎం చంద్ర, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

కేసుల పరిష్కారంలో రాజీయే రాజమార్గం



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి సంయుక్త, వెంకటగిరిలో జడ్జి అనూష, మాట్లాడుతున్న న్యాయమూర్తి అనిల్ కుమార్

నాయుడుపేట టౌన్, జూన్ 29 : కేసుల పరిష్కారంలో రాజీయే రాజమార్గమని నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి సంయుక్త అన్నారు. కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో 112 కేసులు పరిష్కారం కాగా... రూ.3,13,200 నగదు రికవరీ అయినట్లు తెలిపారు. పీపీ స్వాతిరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు పసల చెంగయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్, న్యాయవ్యాదులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి సులోచనరాణి

వెంకటగిరి : పట్టణంలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో జూనియర్ సివిల్ జడ్జి అనూషా మొత్తం 223 కేసులు పరిష్కరించారు. న్యాయవాదులు బీరం మురళీకృష్ణ, బాబ్జి, గాంధీ, రాజేష్ పాల్గొన్నారు.

గూడూరు : కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్‌అదాలత్ నిర్వహించినట్లు న్యాయమూర్తి సులోచనరాణి అన్నారు. కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్‌అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తి లోకనాథం, న్యాయవాదులు, పోలీసు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట కోర్టు ఆవరణలో మొత్తం 149 కేసులు పరిష్కరించారు. న్యాయమూర్తి ఎస్.అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన లోక్‌అదాలత్‌లో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు సంబంధించి క్రిమినల్ కేసులు 81, సివిల్ 17, బ్యాంక్ రికవరి 20, బీఎస్ఎన్ఎల్ 11, ఎస్‌టీసీఎస్ 20 మొత్తం 149 కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించారు. రెండో తరగతి అదనపు న్యాయమూర్తి సుబ్బారావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాముల యాదవ్, క్రాంతికుమార్, లోక్ అదాలత్ సభ్యులు ధర్మాప్రసాద రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కోట : కోటలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం లోక్ అదాలత్ జరిగింది. జడ్జి భరత్‌కమల్ కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన కక్షిదారులు పలు కేసులకు సంబంధించి రాజీపడ్డారు. మొత్తం 423 కేసులు పరిష్కారమయ్యాయి.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్

ఇంటి రుచులతో భోజనం వడ్డించండి
ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 29 : ప్రభుత్వ హాస్టళ్లలో వసతి పొందుతున్న విద్యార్థులకు ఇంటి రుచులతో భోజనం వండి వడ్డించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని 7వ వార్డులో పర్యటించి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. స్థానికులు మంచి నీటి కుళాయిల ద్వారా కలుషితమైన నీరు వస్తోందని చెప్పడంతో మున్సిపల్ కమిషనరును పిలిచి నీటి పంపిణీలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వెంటనే తాగునీటి కలుషితాన్ని అరికట్టాలని చెప్పారు. వర్షాల సీజన్ మొదలు కావడంతో వార్డుల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం క్రాస్ రోడ్డులోని హాస్టళ్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఉదయం పూట పెడుతున్న అల్పాహారాన్ని పరిశీలించారు. గదుల్లో శ్లాబు ఊడి మీదపడుతోందని విద్యార్థులు ఫిర్యాదు చేశారు.

● **ప్రజాదర్బార్ నిర్వహిస్తాం**

కష్టాల్లో వున్న ప్రజలను ఆదుకొనేందుకు త్వరలో ప్రజాదర్బార్ నిర్వహించి వారి సమస్యలకు పరిష్కారం చూపే చక్కటి కార్యక్రమాన్ని మొదలు పెడతామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గత ఐదేళ్ళ నుంచి వైసీపీ పాలకులు ప్రజల సమస్యలు పట్టించుకొన్న పాపాన పోలేదన్నారు. ప్రజలకు అండగా నిలిచేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలను ప్రజాదర్బార్ దృష్టికి తీసుకొస్తే అర్జీలను వాటిని సంబంధిత శాఖలకు పంపి వాటికి సత్వర పరిష్కారం లభించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, అవ్వారు సత్యం, కాపా శ్రీనివాసులు నాయుడు, పునుగోటి విశ్వనాథనాయుడు, మంకు ఆనంద్, మల్లారపు బాబు తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వైసీపీకి కీలక నేత రాజీనామా



బాలచంద్రారెడ్డి

తడ, జూన్ 29 : వైసీపీ కీలకనేత, చెంగాళమ్మ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. దొరవారిసత్రం మండలానికి చెందిన ఆయన 2012లో వైసీపీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరి కీలక నేతగా ఎదిగారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ దువ్వూరు సేవలను గుర్తించి చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పదవి ఇవ్వడంతోపాటు పార్టీ రాష్ట్రస్థాయి పదవిని సైతం కట్టపెట్టింది. అయితే మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు, ఆయనకు మధ్య పొరపచ్చాలు ఏర్పడ్డాయి. కిలివేటి వ్యతిరేక వర్గంగా రాజకీయం చేయడం ప్రారంభించారు. ఒకానొక దశలో కిలివేటికి మరోసారి ఎమ్మెల్యే సీటు ఇస్తే పనిచేసేది లేదని అధిష్ఠానానికి తెగేసి చెప్పారు. ఈ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో ఆయన పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారు. అయితే శనివారం తన వ్యక్తిగత కారణాలతో వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి అధిష్ఠానానికి లేఖ పంపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నాయుడుపేట టౌన్, జూన్ 29 : మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం సమీపంలో రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ అరుణకుమారి తెలిపారు. శనివారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

వాకాడు, జూన్ 29 : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దారు నరసింహారావు సూచించారు. నిడిగుర్తి గ్రామంలో శనివారం సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. పిల్లలను బాగా చదివించి ఉన్నతస్థాయికి ఎదిగేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, వాకాటి సంపత్‌కుమార్, ఆర్ఐ సెల్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలో పూడికతీత పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వెంకటగిరిటౌన్, జూన్ 29: పట్టణంలోని తోలిమిట్ట ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైందని ఆంధ్రజ్యోతిలో శనివారం కథనం రావడంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. శనివారం ఉదయం మున్సిపాలిటీ సిబ్బంది డ్రైనేజీలో పూడిక ఎత్తడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. చెత్తను జేసీబీతో ఎత్తడంతో ఆ ప్రాంతం గుంతగా ఏర్పడిందని, అక్కడ మురుగు ఏర్పడి దుర్వాసన వస్తోందని స్థానికులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన రెండు రోజుల్లో కొత్త మట్టిని తరలించి పరిష్కారం చూపుతామని తెలిపారు.

చెంగాళమ్మ సేవలో నరసింహ యాదవ్

సూళ్లూరుపేట, జూన్ 29: చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని శనివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్ దర్శించుకొన్నారు ఆయనకు ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేదపండితులతో ఆశీర్వచనం చేయించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్ యాదవ్, ఆలీభాయ్, మాధవ్, దాము, రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ వార్షిక శిబిరాలు

కోట, జూన్ 29 : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 9 రోజులపాటు జరిగిన ఎన్‌సీసీ నావెల్ నాల్గవ వార్షిక శిక్షణా శిబిరాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన 649 మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లు హాజరయ్యారు. ఆయా క్యాడెట్‌లకు గన్ ఫైరింగ్, రిగ్గింగ్, షిప్ మోడలింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. నాలుగు విభాగాలలో విజేతలుగా గౌతం జ్ఞానేశ్వర్‌రెడ్డి, దివ్యశ్రీ, వెంకటేశ్వర్లు, కావ్యాలు విజేతలుగా నిలిచారు. ఆయా విజేతలకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి చేతులుమీదుగా బహుమతులు అందజేశారు.

కోటమ్మ ఉత్సవాలు ప్రారంభం



కోటమ్మ అభిషేకానికి సముద్రజలాలు తీసుకువెళ్తున్న నల్లపరెడ్డి కుటుంబీకులు

కోట, జూన్ 29 : కోట గ్రామ దేవత కోటమ్మ ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి-కవితమ్మ దంపతుల ఆధ్వర్యంలో సముద్రజలాలను తీసుకువచ్చి అమ్మవారి విగ్రహానికి అభిషేకం చేసి విశేష అలంకరణలో ఉంచారు. నల్లపరెడ్డి కుటుంబాల నుంచి కోటమ్మకు సారె, పూలబుట్టలను తీసుకొని ఆలయానికి మహిళా భక్తులు వెళ్లి అమ్మవారికి అలంకరించారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఆయా ఎమ్మెల్యేలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యా సామగ్రి పంపిణీ

పెళ్లకూరు, జూన్ 29 : మండలంలోని బంగారంపేట, మోదుగుపాళెం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్ట్‌లతో కూడిన కిట్‌లను స్థానిక సర్పంచ్ దేవారెడ్డి నాగేంద్రప్రసాద్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విక్రమ సింహపురి ఎక్స్‌ప్రెస్‌ను
సూళ్లూరుపేట వరకు పొడిగించాలి



విలేకర్లతో మాట్లాడుతున్న నెలవల, వరప్రసాద్

నాయుడుపేట, జూన్ 29 : ప్రతి రోజూ గూడూరు నుంచి అమరావతికి వెళ్లే విక్రమ సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలును సూళ్లూరుపేట వరకు పొడిగించాలని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేటలోని టీడీపీ కార్యాలయంలో శనివారం మాజీ ఎంపీ వరప్రసాద్‌రావుతో కలసి విలేకర్లతో మాట్లాడారు. వరప్రసాద్‌రావు ఎంపీగా ఉన్న సమయంలో సూళ్లూరుపేట, దొరవారిసత్రం, నాయుడుపేట, ఓజిలి మండలాలలో అనేక అండర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేశారని, అలాగే నాయుడుపేటలో పినాకిని ఎక్స్‌ప్రెస్‌ను నిలుపుదల చేశారని అన్నారు. చెన్నై నుంచి హైదరాబాదుకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ నాయుడుపేటలో నిలుపుదల ఉందని, హైదరాబాదు నుంచి చెన్నైకు వెళ్లే ఎక్స్‌ప్రెస్‌కు నాయుడుపేటలో నిలుపుదల లేదని, ఆ మేర నిలుపుదల ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా సముద్రతీర ప్రాంతాల్లో తుఫాన్ షెల్టర్లకు కేంద్ర నిధుల కేటాయింపులో సహకరించాలన్నారు. పులికాట్ ముఖద్వారాల పూడికతీతకు దోహదపడాలన్నారు. మాజీ ఎంపీ వరప్రసాద్ మాట్లాడుతూ తనకు ఉన్న అనుభవం పరిచయాలతో మాజీ ఎంపీ కోరిన న్యాయమైన ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రకాష్‌నాయుడు, దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, గాడి తిలక్, చక్రపాణి, ముత్యాలయ్య, ఖలీల్, తదితరులు ఉన్నారు.

అల్ట్రా స్కానింగ్ సెంటర్ల మంజూరు

కోట, జూన్ 29 : బాలయపల్లి, డీవీ సత్రం, పెళ్లకూరు ప్రభుత్వ ఆస్పత్రులకు అల్ట్రా స్కానింగ్ సెంటర్లు మంజూరు చేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ అధికారి బాబునెహ్రూరెడ్డి తెలిపారు. కోట ఆసుపత్రి, చిట్టేడులోని ప్రాథమికఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. వైద్యసేవలు, డాక్టర్ల పనితీరు, పనివేళలపై ఆరాతీశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందిస్తున్నామని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వార్డులను, మందులను తనిఖీ చేశారు. ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ రూప, డాక్టర్ జోష్‌ప్రియరావు ఉన్నారు.

భక్తజనసంద్రంగా ముక్కంటి ఆలయం


ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, జూన్ 29: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తజన సంద్రంగా మారింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,973మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 2,690మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,599మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,110, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 311మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 236మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 62 మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 19,576 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన


విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న బొజ్జల రిషితారెడ్డి

శ్రీకాళహస్తి, జూన్ 29: విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అన్నారు. పట్టణంలోని హరహర బావివీధి ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులకు పుస్తకాలు, ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ముందుచూపుతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే నాయకుడని కొనియాడారు. అలాగే తొట్టంబేడు మండలంలోని గుండేలిగుంట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉపకరణాలు అందజేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ పదవీ విరమణ పొందడంతో ఆయనను రిషితారెడ్డి సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు మునిరాజా నాయుడు, విజయకుమార్, కంఠా రమేష్, గాలి మురళీ నాయుడు, సుప్రజ, మస్తాన్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉదయం 6గంటలకే రేషన్ పంపిణీ

కేవీబీపురం, జూన్ 29: మండలంలోని రేషన్ కార్డుదారు లందరికీ జూలై 1వ తేదీ ఉదయం 6గంటల నుంచే ఎండీయూల ద్వారా బియ్యం పంపిణీ చేయాలని సివిల్ సప్లై డీటీ మునిరత్నం ఆదేశించారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని రేషన్ దుకాణాల డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వాహనం ద్వారా సక్రమమైన తూకాలతో రేషన్ అందజేయాలని, ఏ మాత్రం తేడా కనిపించినా లైసెన్సు రద్దు చేస్తామని చెప్పారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ: ఆదిమూలం

నారాయణవనం, జూన్ 29: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జూలై 1వ తేదీన పండుగ వాతావరణంలో చేపట్టాలని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం ఇచ్చిన హామీ మేరకు రూ.3 వేలు ఉన్న పింఛను ఒకేసారి రూ.4 వేలకు పెంచారని తెలిపారు. అంతేకాకుండా గత ఏప్రిల్ నెల నుంచే పింఛను పెంపును అమలు చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల హామీ మేరకు జూలై నెల పింఛను రూ.4 వేలతో పాటు ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల బకాయిలు రూ.3వేలు కలిపి మొత్తం రూ.7వేలు 1వ తేదీ సోమవారం లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే వికలాంగులకు రూ.6 వేలు, క్యాన్సర్, డయాలసిస్ రోగులకు రూ.పదివేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు అందిస్తున్న ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా చేపట్టే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తాను నారాయణవనంలో పింఛను పంపిణీని ప్రారంభిస్తున్నట్లు ఆదిమూలం తెలిపారు.

ఇంటి వద్దే పింఛను అందజేత

శ్రీకాళహస్తి, జూన్ 29: శ్రీకాళహస్తి పురపాలకసంఘ పరిధిలో అర్హులైన లబ్ధిదారులందరికీ జూలై 1వ తేదీన ఇంటి వద్దే పింఛను పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నెలవారి పింఛను రూ.4వేలు, ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి బకాయిలతో కలిపి మొత్తం రూ.7వేలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘ అధికారులు ఉమామహేశ్వరరావు, నారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఇరువర్గాలూ విజేతలే


శ్రీకాళహస్తి, సత్యవేడు కోర్టుల్లో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

శ్రీకాళహస్తి, జూన్ 29: లోక్ అదాలత్ తీర్పుతో ఇరువర్గాలూ విజేతలుగా నిలుస్తారని అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ తెలిపారు. శనివారం శ్రీకాళహస్తి పట్టణంలోని న్యాయస్థానం ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ లోక్ అదాలత్ తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. ఇందులో ఇరువర్గాల వారు విజేతలేనని, ఎక్కడా అప్పీల్ చేయడానికి ఆస్కారం ఉండదన్నారు. లోక్ అదాలత్‌లో అన్ని రకాల కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కాగా, లోక్ అదాలత్‌లో 150 కేసులను పరిష్కరించారు. రూ.2,21,42,855 రికవరీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు బేబీరాణి, ధర్మారావు, పలు శాఖల అధికారులు, బ్యాంకు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సత్యవేడు: స్థానిక కోర్టులో జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వీ.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. క్రిమినల్ కేసులు 28, సివిల్ 6, పీఎల్‌పీ(బ్యాంకు) కేసులు 15, ఒక చెక్‌బౌన్స్, రెండు ఎక్సైజ్, ఐదు మనీసూట్, ఒక ఈపీఐ కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో ఏపీపీ ప్రశాంతి, శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు, బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీస్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

నోటీసులు జారీ చేసినా స్పందించట్లేదు

రేణిగుంట, జూన్ 29: రేణిగుంట పంచాయతీలో జరిగిన అవకతవకలపై రికార్డులు సమర్పించాలని పంచాయతీ కార్యదర్శికి నోటీసులు జారీ చేసినా స్పందించట్లేదని శ్రీకాళహస్తి డీఎల్‌పీవో ప్రభురెడ్డి తెలిపారు. శనివారం గాజుల మండ్యం పంచాయతీ కార్యాలయంలో ఆయన తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు రేణిగుంట పంచాయతీకి సంబంధించిన రికార్డులను అందజేయాలని కార్యదర్శికి ఇప్పటికే నాలుగు సార్లు నోటీసులు జారీ చేసినా బదులు ఇవ్వకుండానే రిలీవ్ అయి వెళ్లిపోయారని తెలిపారు. కాగా, రేణిగుంట పంచాయతీలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రహరీ కూల్చివేతతో టీడీపీ నేతలకు సంబంధం లేదు

ఏర్పేడు, జూన్ 29: ఏర్పేడు మండలం గుండ్లకంట్రిగ పంచాయతీ సర్వే నెంబరు 70లో ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రహరీని కూల్చివేతతో టీడీపీ నేతలను సంబంధం లేదని పంచాయతీ కార్యదర్శి రాజేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన పోలీసులకు, మండల అధికారులకు తెలియజేశారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రహరీ కూల్చివేత విషయమై వైసీపీ సర్పంచు జయముని చెప్పిన వివరాల మేరకు గుండ్లకంట్రిగ గ్రామానికి చెందిన టీడీపీ నేతలు శ్రీధర్, విజయ భాస్కర్, చంద్రశేఖర్‌పై శుక్రవారం సాయంత్రం సీఐ శ్రీరామశ్రీనివాసులుకు ఫిర్యాదు చేశామని చెప్పారు. శనివారం గ్రామంలో విచారించగా ప్రహరీని కూల్చివేతతో టీడీపీ నేతలకు ఎలాంటి సంబంధం లేదని తెలిసిందన్నారు.

బైక్ నుంచి పడి యువకుడి మృతి

నారాయణవనం, జూన్ 29: వేగంగా వెళుతున్న మోటార్ సైకిల్ నుంచి అదుపుతప్పి కిందపడి నందకుమార్(18) మృతి చెందిన ఘటన శనివారం రాత్రి నారాయణవనం మండలంలో జరిగింది. గేట్ పుత్తూరు రజాక్ కాలనీకి చెందిన నందకుమార్ స్నేహితులు విజయ్, గిరితో కలిసి మోటార్ సైకిల్‌పై నారాయణవనానికి వెళ్లారు. శనివారం రాత్రి పుత్తూరుకు తిరిగి ప్రయాణమయ్యారు. నారాయణవనం మండలంలోనివేదవ్యాస డిగ్రీ కళాశాల సమీపంలో వేగంగా వెళుతుండగా మోటార్‌సైకిల్‌లో వెనుకగా కూర్చున్న నందకుమార్ కిందకు పడిపోయాడు. తలకు తీవ్ర గాయ మవడంతో పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఆరణియార్‌లో చేపల వేట నిషేధం

పిచ్చాటూరు, జూన్ 29: ఆరణియార్ ప్రాజెక్టులో జూలై, ఆగస్టు నెలల్లో చేపల వేట నిషేధిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు తెలిపారు. మంచినీటి చేపలు జూలై, ఆగస్టు నెలల్లో సంతానోత్పత్తి చేస్తాయని, ఈ సమయంలో చేపల వేట వల్ల పిల్లల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందన్నారు. రెండు నెలల పాటు మత్స్య కార్మికులు ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లరాదని సూచించారు.

బాడీబిల్డర్ పోటీల్లో సీఆర్‌ఎస్ ఉద్యోగికి గోల్డ్‌మెడల్



రేణిగుంట, జూన్ 29: సీఆర్‌ఎస్‌లో ఉద్యోగి అభిలాష్ జాతీయస్థాయి బాడీ బిల్డర్ పోటీల్లో బంగారు పతకం సాధించారు. ఈ నెల 23న ఢిల్లీలో వరల్డ్ ఫిట్నెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ప్రో క్వాలిఫై చాంపియన్‌షిప్ పోటీల్లో 60 కేజీల కేటగిరిలో అభిలాష్ జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించారు.శనివారం సీఆర్‌ఎస్‌లో జరిగిన కార్యక్రమంలో సీడబ్ల్యూఎం ధైవ సహాయంతో పాటు అధికారులు, ఉద్యోగులు, అభిలాష్‌ను అభినందించారు.

జ్యోతినగర్‌లో సమస్యలకు త్వరలో పరిష్కారం

రేణిగుంట, జూన్ 29: రేణిగుంట పంచాయతీ పరిధిలోని జ్యోతినగర్ సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అన్నారు. శనివారం జ్యోతినగర్, అన్నయనగర్, గణేష్ నగర్ ప్రాంతాల్లోని శానిటేషన్ పనులను ఆమె పరిశీలించారు. అనంతరం వివేకానంద కాలనీ సమీపంలో నూతనంగా వేసిన బోర్లను పరిశీలించారు. బీసీ హాస్టల్‌లో తనిఖీలు చేశారు. టీడీపీ నేతలు మెహబూబ్ బాషా, పుష్పనాథన్, రవి, సుబ్రహ్మణ్యం, మురళి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

లోక్ అదాలతోలో 85 కేసుల పరిష్కారం


కేసులను రాజీ చేస్తున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు టౌన్, జూన్ 29: పుత్తూరు కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 85 కేసులజూ పరిష్కరించి, రూ.1,30,55,920 రికవరీ చేసినట్లు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర తెలిపారు. ఇందులో 27 సివిల్, 54 క్రిమినల్, 7 ప్రీలిటిగేషన్ కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జానకి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ, న్యాయవాదులు శేషాచలం, నదియా, భాస్కర్ రావు పాల్గొన్నారు.

అంగన్వాడీ సమస్యలను పరిష్కరించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీ వర్కర్లు

పుత్తూరు టౌన్, జూన్ 29: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని 42 రోజులుగా సమ్మె చేసి పోరాట ఫలితంగా జీవో విడుదల చేసిందని, ఆ జీవో అమలు చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు మునికుమారి, విజయ కుమారి, రాధ, ధనమ్మ, అంబిక, లలితమ్మ, లక్ష్మీ, కృష్ణవేణి, అరుణ, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీపై ఉద్యోగులకు అవగాహన

పుత్తూరు, జూన్ 29: ప్రభుత్వం ఆదేశం ప్రకారం జూలై 1న పెన్షన్ల పంపిణీని చేయాలని పుత్తూరు మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్, సచివాలయ సిబ్బందికి పెన్షన్ల పంపిణీపై అవగాహన కల్పించారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, జూన్ 29: అప్పలాయగుంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాల నడుమ ఊంజల సేవ నిర్వహించారు. సర్వాలంకార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి మంగళ హారుతలిచ్చారు. ఆలయ అధికారి శివకుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


కుమార గురుపరన్‌ను సన్మానిస్తున్న ఎంఈవోలు

పుత్తూరు టౌన్, జూన్ 29: పుత్తూరు మండలం అక్కేరి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కుమార గురుపరన్ ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. శనివారం ఆయనను ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు. ముఖ్య అతిథిలుగా విచ్చేసిన ఎంఈవోలు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కుమార గురుపరన్ ఉపాధ్యాయ వృత్తిని నిబద్ధతో నిర్వర్తించారని కొనియాడారు. కార్యక్రమంలో దినకరన్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి అష్టబంధనం


అమ్మవారికి భక్తుల పూజలు

పుత్తూరు టౌన్, జూన్ 29: పుత్తూరు మండల పరిధిలోని తడుకు గ్రామంలో గంగమ్మ జాతర సందర్భంగా గ్రామదేవత తడి కాలమ్మ అష్టబంధనం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గంగమ్మ ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణ చేశారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.